క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్ దృష్టికి 14వ వార్డు సమస్యలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని 14వ వార్డులో వర్షాల నేపథ్యంలో నెలకొన్న సమస్యలను ఆ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కె.యోహాన్ బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వివరించారు. దీంతో సమస్యల పరిష్కారానికి మంత్రి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

నడిగూడెం ఎంపీడీఓగా ఎస్‌డీ ఇమామ్

నడిగూడెం : నడిగూడెం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తున్న ఎస్‌డీ.ఇమామ్‌ను రెగ్యులర్ ఎంపీడీఓగా పదోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ రామచంద్రన్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇమామ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ఏఈ లావణ్య, ఎంపీఓ విజయకుమారి, కాశీంబాబు, హరీష్.. ఇమామ్‌కు అభినందనలు తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణ తంతు పూర్తిగావించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి

మునగాల : గణేశ్ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని స్థానిక ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ అనుమతికి విద్యుత్ శాఖ అనుమతితో పాటు డీడీ తీయాల్సి ఉంటుందన్నారు. మండపాల వద్ద ఎలాంటి ఘర్షణలు తలెత్తినా ఆయా ఉత్సవ కమిటీలు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్‌ఐ హెచ్చరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

నడిగూడెం : సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరమని స్థానిక ఏఎస్‌ఐ మల్సూర్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పోలీసు కళా బృందం.. గంజాయి, మత్తు పదార్థాలపై ఆట, పాటలతో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ చింతల వాణి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ మూర్తి, పోలీసు సిబ్బంది వీరబాబు, ప్రతాపరెడ్డి, యల్లయ్య, గోపయ్య, కృష్ణ పాల్గొన్నారు.

శివాలయం హుండీ ఆదాయం రూ. 2,85,537

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్ట కామేశ్వరి సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి దేవాలయం హుండీని ఆలయ అధికారులు బుధవారం లెక్కించారు. ఆరు నెలల హుండీ ఆదాయం రూ. 2,85,537 వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఆలయ మేనేజర్ కొండారెడ్డి, నర్సింహారావు, చందర్‌రావు, శ్రీను, గోవిందరెడ్డి, నాగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

మునగాల : మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నాయకుడు రేఖ తిరపయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. కాగా, తిరపయ్యకు ఇద్దరు కుమార్తెలు. కుమారులు లేకపోవడంతో తన చిన్న కుమార్తె సుస్మిత తండ్రి తిరపయ్యకు తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.

క్రీడల్లోనూ రాణించాలి

గరిడేపల్లి : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో చత్రునాయక్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి అండర్- 14, 17 కుడ్డీ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎన్.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎం.సువర్ణ, డి.నాగమణి, ఫిజికల్ డైరెక్టర్లు హుస్సేన్, రాంప్రసాద్, సైదిరెడ్డి, అంబేద్కర్, ప్రమీల, బాబు, ప్రదీప్, విజయలక్ష్మి, ధనమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

మునగాల : ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ సైదా డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వందల ఎకరాల్లో కౌలు రైతులు సాగు చేసిన పంటలు వరదలకు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో చెరువులు పూర్తి స్థాయిలో నిండి అలుగు పోయడంతో ఆయకట్టు కింద ఉన్న సాగు భూములు మునిగిపోయాయన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే చేపట్టి పంట నష్టం జరిగిన రైతులను ఆదుకోవాలని కోరారు.

దెబ్బతిన్న పొలాలు.. ధ్వంసమైన ఇళ్లు


కోదాడరూరల్ : తొగర్రాయిలో పూర్తిగా కొట్టుకుపోయి మట్టి మిగిలిన వరిపొలం


చిలుకూరు : నారాయణపురంలో చెరువు కట్ట తెగడంతో వరి పొలాల్లో ఏర్పడిన ఇసుక మేటలు

- కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వరదలకు భారీ నష్టం
- పలు గ్రామాల్లో ఇళ్లు నీట మునిగి ఇబ్బందుల్లో బాధితులు
- మేతలేక అల్లాడుతున్న మూగజీవాలు
- వేల ఎకరాల్లో పంట నష్టం

చిలుకూరు : గత నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షం అపార నష్టం మిగిల్చింది. మండలంలోని నారాయణపురం ఊర చెరువు కట్ట నాలుగు చోట్ల తెగి చెరువు కింద ఉన్న సుమారు 300 ఎకరాల్లో పొలాలు నీట మునిగి ఇసుక మేటలు వేశాయి. గెట్లు ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. చెరువు నీళ్లు ఎస్సీ కాలనీని ముంచడంతో ఇళ్లలోని వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. గ్రామంలో 50 ఇళ్లలో పరిస్థితి ఇలాగే ఉంది. ఇప్పుడిప్పుడే వరద బాధితులు వరద దెబ్బ నుంచి తేరుకుంటున్నారు.

నామరూపాల్లేని పొలాలు..

అదేవిధంగా నారాయణపురం నుంచి సీత్లాతండా మీదుగా బాలాజీనగర్ వరకు గల రోడ్డు రెండు ప్రదేశాల్లో తెగింది. దీంతో ఈ రోడ్డు నుంచి రాకపోకలు నిలిచాయి. చిలుకూరు నుంచి దూదియాతండా రోడ్డులో రాయికుంట వాగు ఉధృతికి దూదియాతండా రోడ్డు మూడు చోట్ల దెబ్బతిన్నది. ఆర్లెగూడెం వద్ద ఆర్‌కే మేజర్ కాలువకు గండి పడి గ్రామానికి చెందిన 150 ఎకరాల్లో పొలాలు నీట మునిగాయి. మండల పరిధిలోని ముక్యాల కాలువకు గండి పడి హుజూర్‌నగర్ మండలం కరక్కాయలగూడెంకు చెందిన 50 ఎకరాల పొలాలు నీట మునిగాయి. బేతవోలు, జానకీనగర్, ఆర్లెగూడెం, చిలుకూరు, జెర్రిపోతులగూడెం తదితర గ్రామాల్లో చెరువులు, వాగుల కింద నీళ్లు ఉధృతంగా ప్రవహించడంతో మండల వ్యాప్తంగా 3 వేల ఎకరాల్లో పొలాలు దెబ్బతిన్నాయి. మండల వ్యాప్తంగా 1500 మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వం తక్షణం స్పందించి సాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.

వరద నీటిలోనే పంట పొలాలు

మఠంపల్లి : మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలతో మండలంలోని వరదాపురంలో మునిగిన వందలాది ఎకరాల పంటలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. మంచ్యాతండా వేములూరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పంట పొలాలు వరద నీటిలోనే మునిగి ఉన్నాయి. వేములూరు కుడికాలువకు వచ్చిన భారీ వరదతో కట్ట కొట్టుకుపోయి, కాలువ ఆనవాళ్లు కోల్పోయింది. ప్రభుత్వం వెంటనే కాలువలు బాగు చేయించాలని, రైతులకు పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కోదాడరూరల్ : తొగర్రాయిలో మేతలేక అల్లాడుతున్న గేదెలు


కోదాడరూరల్ : తొగర్రాయిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


అనంతగిరి : కిష్టాపురంలో వరద బీభత్సానికి చెల్లాచెదురైన మంచాలు, పరుపులు, దుస్తులు


కూచిపూడిలో ఇసుకలో కూరుకుపోయిన బైక్‌ను బయటకు తీస్తున్న వ్యక్తులు


మఠంపల్లి : హనుమంతులగూడెం సమీపంలో ఆనవాళ్లు కోల్పోయిన వేములూరు కుడికాలువ


మఠంపల్లి : మంచ్యాతండా వద్ద వేములూరు వాగు వరద నీటిలో మునిగిన పంట పొలాలు


అనంతగిరి : కిష్టాపురంలో వరద తాకిడికి కోతకు గురైన ఇంటి కింది భాగం


చిలుకూరు : నారాయణపురంలో రైస్ మిల్లులో చేరిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది


చిలుకూరు : నారాయణపురంలో వరదలకు కూలిన ఇంటి గోడ


ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి కోదాడ మండలం తొగర్రాయికి చెందిన పోతురాజు శ్రీను. ఇతనికి నాలుగు ఆవులు, ఐదు గేదెలు, దూడలు ఉన్నాయి. పాడిపై ఆధారపడిన ఆయన 500 మోపుల వరిగడ్డిని గ్రామ శివారులో వాముగా వేసుకున్నాడు. నాలుగు రోజుల కిందట గ్రామంలో వచ్చిన భారీ వరదలకు గడ్డివాము కొట్టుకుపోయింది. దీంతో పశువులను మేపేందుకు గడ్డి లేక ఇబ్బంది పడుతున్నాడు. పరిసర ప్రాంతాల్లో గడ్డిని కొనుగోలు చేసేందుకు వెతుకుతున్నాడు.

సర్వం కోల్పోయాం


ఉదయం స్టవ్‌పై టీ కాస్తున్నా. ఉన్నట్లుండి ఇంట్లోకి వరద నీరు భారీగా చేరింది. చేసేది ఏమిలేక అన్ని వదిలేసి పిల్లలను తీసుకుని బయటకు పరుగులు పెట్టాం. ఏ ఒక్క వస్తువు కూడా మిగల్లేదు. డబ్బులు, బంగారు దిద్దులు, దుస్తులు, దుప్పట్లు అన్ని వరదలో కొట్టుకుపోయాయి. సర్వం కోల్పోయాం

– మద్దెల త్రివేణి, కిష్టాపురం

ఒక్కసారిగా ఇంటిని నీరు చుట్టుముట్టింది


పాలేరు వాగు పొంగడంతో ఒక్కసారిగా నీరు ఇంటిని చుట్టుముట్టింది. పిల్లతల్లిని కావడంతో చాలా భయపడ్డాను. స్థానికులు కొందరు వచ్చి మమ్మల్ని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇప్పటికీ ఆ రోజు జరిగిన సంఘటన కళ్లముందే కనిపిస్తోంది. బట్టలు లేక, సమయానికి ఆహారం లేక ఇబ్బంది పడుతున్నాం.

– మాగి మాధవి, గోండ్రియాల

వరద బాధితులకు నిత్యావసర సరుకులు అందజేత


వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలో చెరువు కట్ట తెగి ఇళ్లలోకి నీళ్లు రావడంతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు గ్రామానికి చెందిన ఆల్ట్రా పేయింట్స్ ఎండీ దేవరం సైదిరెడ్డి సహకారంతో దేవరం సైదిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల విలువ గల నిత్యావసర సరుకులను తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాధితులు సైదిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బూర లక్ష్మీనారాయణ, చెడపంగు అంబేద్కర్, ఎంపీఓ జగదీష్, ఆర్‌ఐ మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, గ్రామ కార్యదర్శి కవిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలంలోని దొండపాడులో వరద బాధిత కుటుంబాలకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, నాయకులు జి.పుల్లారెడ్డి, సీహెచ్.వెంకయ్య, ఎం.వెంకటరెడ్డి, చిన్న వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, డీడీ రామయ్య, కార్తీక్‌యాదవ్, అనిమిరెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భోజనం ఏర్పాటు

కోదాడరూరల్ : మండలంలోని కూచిపూడిలో అంతరగంగా వాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామంలో 80 శాతం మేర ఇళ్లు నీట మునిగాయి. అనేక మంది ప్రజలు సర్వస్వం కోల్పోయారు. దీంతో వరద బాధితులు ఇబ్బంది పడకుండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు శంకరశెట్టి కోటేశ్వరరావు బుధవారం మూడు పూటలు భోజనం ఏర్పాటు చేశారు.

గోండ్రియాలలో వరద బాధితులకు అన్నదానం

అనంతగిరి : మండలంలోని గోండ్రియాల గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలకు గురైన బాధితులకు బుధవారం వాసవీ, వనితా క్లబ్, స్ఫూర్తి కిట్టి సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. వరద బాధితులకు దుప్పట్లు, దుస్తులు, బెడ్‌షీట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వాసవీ, వనితా క్లబ్ కోదాడ అధ్యక్షురాలు తొడుపునూరి మంజుల మాట్లాడుతూ వాసవీ వనితా క్లబ్ ఇంటర్‌నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పబ్బా గీతాదేవి పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ యాదారాణి, గొట్టిముక్కుల బాబురావు, నెల్లూరి వినయ్, ఆలయ కమిటీ చైర్మన్ ఏటుకూరి రమేష్, ఇమ్మడి సతీష్ బాబు, గుండా ప్రవీణ్, వెంపటి ప్రసాద్, కొండూరు మాధవి, పబ్బా వెంకటేశ్వర్లు, న్యాయవాది ఈదుల కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


గోండ్రియాలలో అన్నదానం చేస్తున్న వాసవీ, వనితా క్లబ్, స్ఫూర్తికిట్టి సంస్థ సభ్యులు

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి

నడిగూడెం : మండల కేంద్రంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నడిగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న బాధితులను బుధవారం ఆమె పరామర్శించారు. అనంతరం వాగును పరిశీలించి మాట్లాడారు. దళిత వాడలో వీధీ దీపాలు వెలగడం లేదని, డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉందని, చౌదరి చెరువు నిండి అలుగు పోస్తే ఎస్సీ, బీసీ కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరుతుందని కాలనీవాసులు ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా చెప్పుకున్నారు. దీంతో ఆమె తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వాగుపై వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఆమె వెంట తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంపీఓ విజయకుమారి, మాజీ ఎంపీపీ యాతాకుల జ్యోతి, మాజీ జెడ్పీటీసీ బాణాల కవిత, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, కార్యదర్శి వేపూరి సుధీర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


నడిగూడెంలో వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

తాడువాయి బ్రిడ్జి పరిశీలన

మునగాల : మండలంలోని తాడువాయిలో నూతన నిర్మిస్తున్న బ్రిడ్జిని బుధవారం రాత్రి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరదల కారణంగా ఫార్మేషన్ రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులతో మాట్లాడి యుద్ధప్రాతిపదికన నూతన ఫార్మేషన్ రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. ఆమె వెంట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి, ఎలక నరేందర్‌రెడ్డి, కొలిశెట్టి బుచ్చిపాపయ్య, కాసర్ల కోటేశ్వరరావు, కాసర్ల బోస్, వేనేపల్లి వీరబాబు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, సొంపంగు గోపి ఉన్నారు.

రోడ్డు తెగింది.. చెరువే దారైంది

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల నల్లచెరువు ఇటీవల కురిసిన భారీ వర్షానికి తెగిపోవడంతో గోపాలపురం నుంచి బూరుగడ్డ, కరక్కాయలగూడెం వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమై గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రోడ్డుపై వెళ్లేందుకు వీలు లేకపోవడంతో పాఠశాల, కాలేజీలకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రయాణికులు చెరువులో నుంచి దారి ఏర్పాటు చేసుకొని అందులో నుంచి గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తెగిన రోడ్డును పునరుద్ధరించాలని ప్రయాణికులు, విద్యార్థులు కోరుతున్నారు.


చెరువులో నుంచి నడిచి వెళ్తున్న విద్యార్థులు, ప్రయాణికులు

ఎకరాకు రూ.50 వేలు నష్ట పరిహారం ఇవ్వాలి

హుజూర్‌నగర్‌రూరల్ : వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ తదితర గ్రామాల్లో నీటి మునిగి దెబ్బతిన్న వరి పొలాలను రైతు సంఘం నాయకులతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆమె వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీను, జిల్లా కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, జక్కుల రమేష్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.


హుజూర్‌నగర్‌రూరల్ : ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలిస్తున్న పశ్య పద్మ తదితరులు

నష్టంతో తీవ్ర నిరాశలో రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉస్తెల నారాయణరెడ్డి కోరారు. చింతలపాలెంలో దెబ్బతిన్న పంట పొలాలను బుధవారం సీపీఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు మండలంలో పత్తి, మిరప, వరి పొలాలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, నాయకులు అంకరాజు, వీరబాబు, జియాలుద్దీన్, కోటిరెడ్డి, రామారావు, మంగయ్య, కృష్ణ, రామాంజి, పుల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మోతె : భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లు కూలిపోయి నిరుపేదలు నిరాశ్రయులయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు తెలిపారు. మోతె మండల కేంద్రంలో వర్షాల మూలంగా కూలిన ఇళ్లను ఆయన బుధవారం పరిశీలించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ఇళ్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చర్లపల్లి మల్లయ్య, ఎడమ పద్మ, యాదమ్మ, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలి

నేరేడుచర్ల : రాష్ట్రంలో కురిసిన వర్షాలతో నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకుడు కారింగుల వెంకన్న, నియోజకవర్గ కన్వీనర్ వాసా పల్లయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, వాసా కరుణాకర్, రెడ్డిపల్లి వినయ్, చందనబోయిన లక్ష్మి, పావని, సత్తెమ్మ, మరియమ్మ ఉన్నారు.

మిర్చి, పత్తి రైతులకు నష్టపరిహారం అందించాలి

మేళ్లచెరువు : మండలంలో వానలకు దెబ్బతిన్న పంటలను బుధవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కార్య దర్శి వట్టెపు సైదులు మాట్లాడుతూ మండలంలో దెబ్బతిన్న వరి, పత్తి, మిర్చి పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టి.స్వామి, గుండు సైదులు, వెంకటేశ్వర్లు, రాము, శ్రీను, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు

గరిడేపల్లి : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాట్సాప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్స్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, లోన్ యాప్స్‌లో లోన్ తీసుకోవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930 సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుంగిన చెరువు కట్టను పరిశీలించిన డీఈ

పాలకవీడు : భారీ వర్షాలకు మండలంలోని గుండ్లపహాడ్ చెరువు కట్ట కుంగింది. చెరువు కట్టపై ఉన్న మఠంపల్లి నుంచి దామరచర్లకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు బీటలు వారింది. బుధవారం ఎన్నెస్పీ డీఈ అమరేందర్‌రెడ్డి చెరువు కట్ట కుంగిన ప్రదేశాన్ని పరిశీలించి మాట్లాడారు. చెరువులో వరద నీరు చేరడంతో కట్ట బలహీన పడిందన్నారు. దానికి తోడు భారీ వాహనాలు వెళుతుండడంతో మరింత కుంగిపోయిందన్నారు. చెరువు అంచు వైపు ప్రయాణాలు చేయకుండా చూడాలని, ఆ ప్రాంతంలో భారికేడ్లు ఏర్పాడు చేయించాలని తహసీల్దార్ కమలాకర్‌కు సూచించామన్నారు. చెరువులో నీటి నిల్వ ఉండడంతో మరమ్మతులు చేయడం కుదరదన్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

నడిగూడెం : చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల విద్యాధికారి ఎండి.సలీం షరీఫ్ కోరారు. బుధవారం మండలంలోని తెల్లబల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జి.పద్మావతి, నోడల్ అధికారి ఉపేందర్, రీసోర్స్ పర్సన్లు సీహెచ్.వెంకటేశ్వర్లు, సురేష్, సీఆర్‌పీ నందిగామ రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన

హుజూర్‌నగర్ : పట్టణంలోని 14 వార్డులో వర్షంతో దెబ్బతిన్న ఇళ్లను కౌన్సిలర్ ఇందిరాల త్రివేణి బుధవారం పరిశీలించారు. బాధితుల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. యోహాన్, ఆర్‌పీ నళిని, అంగన్వాడీ టీచర్ రేణుక పాల్గొన్నారు.

రామాపురంలో ఫీవర్ సర్వే

నడిగూడెం : మండలంలోని రామాపురంలో త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరం, దగ్గు, జలుబుతో బాధపతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు అన్నపూర్ణ, కామేశ్వరి, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సర్వే చేపట్టాలని వినతి

మునగాల : వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వరద నీటితో పంటలు నీటమునిగి రైతులకు అపార నష్టం జరిగిందని, తక్షణమే రెవెన్యూ అధికారులు పంట నష్టంపై సర్వే చేపట్టాలని బీసీ యువజన సంఘం నాయకులు గడ్డం లక్ష్మీనారాయణ, సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. ఈమేరకు వారు బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నష్ట పోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు ఎం.రోషయ్య, ఎం.రామకోటి, కె.శ్రీను, టి.శ్రీశైలం, గడ్డం కోటిలింగం, ఎం.వీరయ్య పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

హుజూర్‌నగర్ : త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక హుజూర్‌నగర్, కోదాడ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం హుజూర్‌నగర్‌లో శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా భజన, కోలాట నృత్యాలు, భక్తి గీతాలతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కమిటీ అధ్యక్షుడు, సభ్యులు పోటు వెంకటేశ్వర్లు, ముత్తవరపు శైలజ, వంగాల మహేష్, ఉల్లి అరుణ, చల్లా నరసింహారావు, జాస్తి శివరామకృష్ణ, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


ఊరేగింపులో కోలాటం వేస్తున్న మహిళలు